క్లుప్తంగా

అధికారుల సేవలు మరువలేనివి


ఫీల్డ్ అధికారిని సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం: కెనరా బ్యాంకు అధికారుల సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. గురువారం సాయంకాలం స్థానిక కెనరా బ్యాంకులో బదిలీపై వెళ్లిన మేనేజర్ ప్రహ్లాద్, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, ఫీల్డ్ ఆఫీసర్ లోకేష్‌ను గ్రామస్తులు, ఖాతాదారులు, మహిళలు సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు మారుతి ప్రసాద్, హనుమంతరాయ, తిప్పేస్వామి బ్యాంకు అధికారుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మేనేజర్ ప్రహ్లాద్ తమిళనాడులోని తిరుచూర్‌కు, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ మధురై, ఫీల్డ్ అధికారి లోకేష్ దిండిగల్‌కు ప్రమోషన్‌పై వెళ్లారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ గ్రూపులకు సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ హేమలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించిన బీకాం కంప్యూటర్స్,బీకాం, బీఏ పొలిటికల్ సైన్స్, బీఎస్సీ గ్రూపుల్లో నేరుగా అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. అడ్మిషన్ సందర్భంగా విద్యార్థులు తప్పనిసరిగా ఒరిజినల్ టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, స్టడీ, కాండక్ట్, బదిలీ సర్టిఫికెట్లతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. అడ్మిషన్ పొందడానికి విద్యార్థులు తమ తల్లిదండ్రులను కూడా పిలుచుకుని రావాలని సూచించారు.

జోరుగా విత్తన వేరుశనగ పంపిణీ

- ఇంతవరకు 14,560 మంది రైతులకు 13,030.39 క్వింటాళ్ల పంపిణీ

మడకశిర: నియోజకవర్గంలో జోరుగా విత్తన వేరుశనగ పంపిణీ సాగుతోంది. మడకశిర వ్యవసాయ డివిజన్ పరిధిలోని 71 ఆర్బీకేల్లో ఇంత వరకు 14,560 మంది రైతులకు 13,030.39 క్వింటాళ్ల విత్తనకాయలను పంపిణీ చేసినట్లు ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు. మడకశిర మండలంలో 4,819 మంది రైతులకు 4003, అమరాపురం 3,719 మంది రైతులకు 3,356.30, గుడిబండ 3,119 మంది రైతులకు 2,796, అగళి 1,726 మంది రైతులకు 1,465.60, రొళ్ళ మండలంలో 1,177 మంది రైతులకు 1,409.49 క్వింటాళ్ల చొప్పున విత్తనాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా విత్తనం అవసరమైన రైతులు ఆర్బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకుంటే అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎవరూ అధైర్యపడొద్దు


మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోయినంత మాత్రాన మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధైర్య పడొద్దని పార్టీ అండగా ఉంటుందని ఎంపీపీ ఈరన్న తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. అయితే తమ పార్టీకి రాష్ట్రంలో ఇలాంటి ఓటమి వస్తుందని కలలో కూడా అనుకోలేదన్నారు. ఎందుకు ఇలా జరిగిందో విశ్లేషణ చేసుకుని రాబోవు కాలంలో ప్రజల పక్షాన పోరాటం చేద్దామన్నారు. ప్రస్తుతం ఏర్పడబోయే ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు.

పౌష్టికాహారంతో పిల్లల్లో ఎదుగుదల


చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రెడ్డిరమణమ్మ

లేపాక్షి: పౌష్టికాహారంతో పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని సీడీపీఓ రెడ్డిరమణమ్మ పేర్కొన్నారు. కొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఉదయం 7 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లల తల్లులకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం మొదలు పెట్టే కార్యక్రమంపై చిన్నారుల తల్లులకు సీడీపీఓ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతు పిల్లలు అన్ని రకాలుగా అభివృద్ధి సాధించాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా వంటల ప్రదర్శన ఏర్పాటు చేసి తల్లులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం ఎలా తయారు చేసుకోవాలో తెలియజేశారు. అనంతరం వయస్సుకు తగిన బరువున్న పిల్లలు, హెల్తీ బేబీ తల్లులకు బహుమతులను ప్రదానం చేశారు.

వైభవంగా శనీశ్వరుడి జయంతి వేడుకలు

పావగడ: పట్టణంలోని శనిమహాత్ముడి ఆలయంలో గురువారం స్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రాతఃకాల పూజలు, నవగ్రహ మూల మూర్తులకు ఏకాదశ వార రుద్రాభిషేకం, నవగ్రహ హోమం, ప్రధాన మూల మంత్ర హోమాలు, గాయత్రి హోమం, మహా పూర్ణాహుతి, కలశోదక అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. అనంతరం జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరస్వామి దీపాలంకృత ఉత్సవం కనుల పండువలా సాగింది. మూడు రోజులుగా సాగుతున్న శని జయంతి వేడుకలు గురువారం ముగిశాయి. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. ఆలయ సమితి పదాధికారులు భక్తులకు సేవలందించారు.

అమరాపురం: మండల కేంద్రంలోని బస్టాండులో వెలసిన శనీశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి అర్చకులు నరసింహభట్టాచార్యులు తైలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రాకారోత్సవం, నవగ్రహ పూజ, సాయంకాలం ఉయ్యాలోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

శనీశ్వరాలయంలో విశేష పూజలు

హిందూపురం: స్థానిక డిబీకాలనీలోని శనేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమవాస్యను పురస్కరించుకుని మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, తిల, తైలాభిషేకం అనంతరం పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు ఆలయంలో గోత్రనామాలతో తిల తైలాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం జ్యేష్టాదేవి సమేత శనీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేశారు. ఈసందర్భంగా భక్తులు నువ్వులనూనెలతో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.


అమరాపురంలో శనీశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా శనేశ్వరస్వామి జయంతి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన శనీశ్వరస్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, పుష్పాలంకరణ పూజ, తులసీపూజ, నవగ్రహారాధన తదితర పూజలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, వెండి కవచంతో పాటు బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు.స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూకట్టారు. కొందరు భక్తులు నల్లటి నువ్వులతో జ్యోతులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పావగడ: శనీశ్వరస్వామి చెంత పూజలందుకున్న నవగ్రహాలు


హిందూపురం: పుష్పాలంకరణలో శనీశ్వరుడు


రొళ్లలో పూజలందుకున్న శనీశ్వరుడు

మడకశిర మండలంలో మోస్తరు వర్షం


సోమందేపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం


అమరాపురం మండలం గౌడనకుంటలో కురుస్తున్న వర్షం

మడకశిరరూరల్: నైరుతి రుతుపవనాలతో మండలంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. బుధవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం పడడంతో బుళ్లసముద్రం వద్ద 33 కేవీ విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు పడ్డాయి. యూరంగాపురం వద్ద విద్యుత్ లైన్‌లో మర్మమతు సమస్య రావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ ఏఈ మహేంద్ర సిబ్బందితో కలిసి రెండు చోట్ల విద్యుత్ మరమ్మతు చేయించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వర్షా కాలంలో విద్యుత్ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏఈ తెలిపారు. ఇదిలా ఉండగా మూడు రోజుల నుంచి మోస్తరు వర్షం కురువడంతో ఖరీఫ్ పంట సాగుతోపాటు భూములను దున్ని దుక్కి చేసుకోవడానికి, బోరు బావుల కింద వివిధ రకాల విత్తనాలు వేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అమరాపురం: మండలవ్యాప్తంగా గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మూడు రోజుల క్రితం తుంపర వర్షం పడింది. అయితే గురువారం మధ్యాహ్నం వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వేరుశనగ పంట సాగు చేయడానికి అనుకూలంగా ఉందని రైతులు తెలిపారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి, గురువారం ఓ మోస్తరు వర్షం పడింది. దీంతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేయడానికి ఎంతో ఉపయోగకారంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి భారీవర్షం కురిసింది. మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్నచిన్న చెక్‌డ్యాంల్లో నీరు చేరింది. అదేవిధంగా పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉంది. మండలంలో 33.8 మి.మీ, హిందూపురంలో 35 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఓ శ్రీలత గురువారం పేర్కొన్నారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,188 మంది రైతులకు 1519.8 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశామని తెలిపారు.

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా వర్షం జోరుగా కురవడంతో రోడ్లపై నీరు ప్రవహించింది. ఆకాశాన్ని మేఘాలు కప్పేసిన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. పలువురు తమ మొబైల్‌లలో ఆ దృశ్యాన్ని బంధించారు.

బీసీజీ టీకాతో క్షయను తరిమికొడదాం


మండలపల్లి సచివాలయంలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది


కరిదాసన్నపల్లిలో టీకా వేస్తున్న దృశ్యం

గుడిబండ: బీసీజీ టీకాతో క్షయను తరిమికొడదామని మెడికల్ ఆఫీసర్ సౌందర్య, పీహెచ్‌ఎన్ సుధారాణి పేర్కొన్నారు. గురువారం మండల వ్యాప్తంగా ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఆరోగ్య సిబ్బంది వృద్ధులకు టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాప్యంలో టీకాలు వేయడం వల్ల ఎలాంటి వ్యాధుల బారినపడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందన్నారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వయస్సు గల ప్రతి ఒక్కరూ టీకాలు వేయించుకోవాలని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో క్షయ వ్యాధికి మందులు వాడిన వారు తప్పనిసరిగా బీసీజీ టీకా వేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 1,060 మందికి టీకా వేసినట్లు వారు తెలిపారు.

అగళి: టీబీ(క్షయ) నియంత్రణ చర్యల్లో భాగంగా వైద్యులు శివనంద, గాయత్రి ఆధ్వర్యంలో గురువారం బీసీజీ టీకా కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానంద్ 18 ఏళ్లు దాటిన, ఐదేళ్ల కిందట మందులు వాడి టీబీ తగ్గిన వారికి, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం అలవాటు ఉన్న వారు, 60 ఏళ్లు పైబడిన వారికి టీకాను వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి

పావగడ: అనాథలు పిల్లలను గుర్తించి వారిని చేరదీయాలని స్థానిక జేఎమ్‌ఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి మాదేశ్ అధికారులకు సూచించారు. పట్టణంలోని గురుభవన్ ఆవరణలో గురువారం నిర్వహించిన బాల కార్మిక నిర్మూలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. దుకాణాలు, హోటళ్లు, వెల్డింగ్ షాపుల్లో పనులు చేస్తున్న చిన్నారి పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించి విద్యనందివ్వాలన్నారు. పిల్లలను పనుల్లోకి చేర్చుకున్న యజమానులపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. తహసీల్దార్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలను మట్టి బొమ్మలని ఎలా తీర్చిదిద్దితే అలా ఎదుగుతారన్నారు. బాల్య దశ నుంచే పిల్లలకు విద్య నందించి జ్ఞానాభివృద్ధిని పెంచాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్, ప్రధాన సివిల్ న్యాయమూర్తి సుధీర్, అధిక సివిల్ న్యాయమూర్తి ప్రియాంక పాల్గొన్నారు.


బాల కార్మిక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలో భవనాలు నిర్మిస్తున్న యాజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం మున్సిపాల్టీలోని 24వ వార్డు వీడీ రోడ్డులో మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. వార్డులో అనుమతుల మేరకు భవనాలు నిర్మిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనుమతులు లేకుండా భవనా నిర్మాణాలు, అంతస్తులు నిర్మించినా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. భవన నిర్మాణ యాజమానులు వెంటనే స్పందించి మున్సిపాల్టీలో అవసరమైన అనుమతులు తీసుకోవాలన్నారు. నోటీసుల అనంతరం నేరుగా అనుమతులు లేనివాటిని కూల్చివేస్తామని హెచ్చరించారు.


24వవార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక


క్రీడాకారిణిలను అభినందిస్తున్న కోచ్‌లు

ధర్మవరం అర్బన్: వెంకటగిరిలో ఈనెల 7నుంచి 13వరకు జరగనున్నఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నీకి అండర్–19, అండర్ –23 విభాగంలో ధర్మవరం నుంచి ముగ్గురు బాలికలు ఎంపికైనట్లు కోచ్‌లు రాజశేఖర్, పృద్వీలు తెలిపారు. పట్టణానికి చెందిన నాగజ్యోతి, తేజు దీపికలు అండర్–19 విభాగంలో అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీయాగం



ధర్మవరం అర్బన్: పట్టణంలోని గుడ్డిబావి వీధిలో ఉన్న త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా మహా చండీయాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు రాఘవశర్మ త్రిలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహా చండీయాగం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హోమంలో పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- ఆర్డీఓ భాగ్యరేఖ, పీడీ లక్ష్మీకుమారి

పుట్టపర్తి అర్బన్: బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పక్కాగా అమలు చేస్తూ బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చి దిద్దడానికి సిద్ధం కావాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పిలుపునిచ్చారు. చట్టం నిబంధనలపై పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్డీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం జీఓ ఎంఎస్ 13ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి అధికారులను, సిబ్బందిని నియమించిందన్నారు. బాలికా చదువు ఇంటికి వెలుగును నింపుతుందని, ఈ విషయాలను ఆడపిల్లల తల్లిదండ్రులకు తెలియజేసి బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అర్బన్ డీఎస్పీ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నాయనే సమాచారాన్ని మండల పోలీస్ అధికారులకు చేరవేస్తే వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి వాటి అనర్థాలను తెలియజేసి నివారిస్తామన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 181కు సమాచారం ఇవ్వాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో చెప్పినా పర్వాలేదన్నారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై డీసీపీఓ మహేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక చట్టంపై ఏర్పాటు చేసిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీడీపీఓలు గాయత్రి, అనురాధ, వరలక్ష్మి, జిల్లా బాలల సమితి పరిరక్షణ అధికారులు నాగలక్ష్మి, మురళీ, ఐసీపీఎస్ అధికారి కొండప్ప, శిశు గృహ సిబ్బంది, వీఆర్‌ఓలు, మహిళా పోలీస్‌లు పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ, ఇతర అధికారులు

ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

చెన్నేకొత్తపల్లి: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు గురువారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. ప్రవేశ పరీక్షలో పాస్ అయిన విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని వెల్లడించారు. పై తరగతులతో పాటు ఇంటర్‌లో ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో చేరదలచిన విద్యార్థులు కళాశాల పని వేళల్లో సర్టిఫికెట్లతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

అమడగూరు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పంట రుణాలను తీసుకున్న రైతులు ఈ నెల 15లోగా రెన్యూవల్ చేసుకోవాలని అమడగూరు బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఇప్పటికే 95 శాతం మంది రైతులు వడ్డీలు చెల్లించి రెన్యూవల్ చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన రైతులు జామీనుదారులను తీసుకు వచ్చి, వడ్డీ చెల్లించి ఈ నెల 15 లోపు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. తర్వాత వడ్డీ చెల్లించినా ప్రభుత్వ పరిహారం వర్తించవన్నారు.

కోగిరలో పోలీస్ పికెటింగ్


కోగిరలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

రొద్దం: కోగిర గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు గురువారం చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ ముగిశాక గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిందే. సమస్యత్మక గ్రామం కావడంతో ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో బందోబస్త్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన ఎన్నికల కోడ్

- నేటి నుంచి యథావిధిగా ప్రభుత్వ కార్యకలాపాలు

మడకశిర: దేశ వ్యాప్తంగా అమలులో ఉన్న ఎన్నికల కోడ్ గురువారంతో ముగిసింది. దీంతో నియోజకవర్గంలో శుక్రవారం నుంచి ప్రభుత్వ కార్యకలాపాలు యథావిధిగా ప్రారంభం కానున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. మార్చి 16 ఎన్నికల షెడ్యూల్‌ను సీఈసీ ప్రకటించింది.అప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దాదాపు దేశ వ్యాప్తంగా 80 రోజుల పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఎన్నికల కోడ్ గడువు ముగియడంతో అటు అధికారులకు ఇటు ప్రజలకు ఊరట లభించింది.

బాధితులను ఆదుకోండి

పావగడ: తాలూకాలోని హుస్సేన్‌పురంలో వేప చెట్టు ఇళ్లపై కూలిన ఘటనలో బాధితులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప గురువారం స్థానిక తహసీల్దార్ ను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నఫళంగా వేపచెట్టు కుప్ప కూలి పోయి నాగరాజు, మాధవరాజు, అక్కులప్ప కు చెందిన ఇళ్లపై పడడంతో ఇళ్ళు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. నరసింహ కారు, అక్కులప్ప దుకాణం, బైకు దెబ్బ తినడంతో పాటు కొంత మందికి చిన్నపాటి గాయాలయ్యాయన్నారు. ఘటనలో రెండు నెలల మేక పిల్ల మృతి చెందిందన్నారు. అంతే కాకుండా పక్కనే ఉన్న మౌలాలి గుడి కూడా దెబ్బతిందన్నారు. ప్రకృతి వికోపంతో జరిగిన సంఘటన లో బాధితులకు ఆర్థిక పరిహారం చెల్లించాలని తహసీల్దార్ సంతోష్ కుమార్, అటవీ శాఖ అధికారుల ను పూజారప్ప డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రొద్దం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా రొద్దం, ఎం కొత్తపల్లి, నారనాగేపల్లి, రొద్దకంపల్లి, కనుమర, గౌరాజుపల్లి, తాడంగిపల్లి, మోపర్లపల్లి, రెడ్డిపల్లి, దొడగట్ట, గోనిమేకులపల్లి, పెద్దగువ్వపల్లి, చిన్నమంతూరు, పెద్దకోడిపల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరాశ్రయులకు ఆసరా


నిరాశ్రయ మహిళలతో హెల్ప్ సొసైటీ సభ్యులు

పావగడ: విజయవాడ కు చెందిన తల్లి రాజలక్ష్మమ్మ కుమార్తెలు శృతి, గీత రెండు రోజుల నుంచి స్థానిక శని మహాత్మ దేవాలయం వద్ద యాచన చేస్తుండగా స్థానిక హెల్ప్ సొసైటీ మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ గురువారం వారిని పసి గట్టింది. ఈ మేరకు వారిని విచారించగా తాము విజయ వాడకు చెందిన వారిమని, పావగడ లో తమ బంధువుల పిలుపు మేరకు వచ్చామని అయితే వారు ఫోన్ తీయడం లేదన్నారు. కాగా తాము తిరుగు ప్రయాణం చేయడానికి ఛార్జీలకు డబ్బు లేక పోవడంతో యాచిస్తున్నామని తెలిపారు. దీంతో శశికళ స్పందించి హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్‌కు సమాచారం అందించారు. మానం శశికిరణ్ వారికి రూ.10 వేలు ఇచ్చి సొంతూరికి సాగనంపారు.